

సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డిని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్ రెడ్డి సోమవారం సచివాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.
- అబ్దుల్లాపూర్‌మెట్, ఆంధ్రజ్యోతి



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.
- ఎల్‌బీనగర్, ఆంధ్రజ్యోతి



ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని సన్మానిస్తున్న టీపీసీసీ కార్యదర్శి కోట్ల శ్రీనివాస్, ఆర్యవైశ్య సంఘం నేత అమరవాది లక్ష్మీనారాయణ, బీసీ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి గుజ్జకృష్ణ. - సైదాబాద్, ఆంధ్రజ్యోతి



ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ వైస్ చైర్మన్, ఉప్పల ఫౌండేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా ఎల్బీనగర్‌లోని అనాథ విద్యార్థి గృహంలో విద్యార్థుల మధ్య నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు. బిస్కెట్స్, స్నాక్స్ అందజేశారు. వైశ్య ఫెడరేషన్ రంగారెడ్డి జిల్లా యువజన సంఘం అధ్యక్షుడు లోకేష్‌గుప్తా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గృహ అధ్యక్షుడు రాజేష్, వైశ్య ఫెడరేషన్ అధ్యక్షుడు చింతల రజనీకాంత్, మహిళా అధ్యక్షురాలు చందా భాగ్యలక్ష్మి, ప్రధాన కార్యదర్శి శైలజ, మణిమాల పాల్గొన్నారు. - ఎల్‌బీనగర్, ఆంధ్రజ్యోతి

జీవితంపై విరక్తి చెంది వృద్ధుడి ఆత్మహత్య



వెంకటేశ్వర్లు (ఫైల్)

దిల్‌సుఖ్‌నగర్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మానసికంగా కుంగుబాటుకు గురైన ఓ వృద్ధుడు జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. సరూర్‌నగర్ పోలీసులు వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి.. కర్మన్‌ఘాట్‌లోని మాధవరం సెరెనిటీ అపార్ట్‌మెంట్ బి బ్లాక్ ఫ్లాట్ నెం.514లో పారేపల్లి మురళీకృష్ణ (హెచ్‌డీఎఫ్‌సీ ఉద్యోగి) కుటుంబం మూడేళ్లుగా నివాసముంటుంది. ఆయన తండ్రి వెంకటేశ్వర్లు (74) కొద్దికాలంగా మానసిక సమస్యలతో ఇబ్బంది పడుతున్నాడు. ఇటీవల సోదరులు, వదినలు మరణించడంతో తాను ఒంటరినైపోయానని ఆందోళన చెందుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి 8.30 గంటల సమయంలో ఇంట్లో వారికి చెప్పకుండా బయటకు వెళ్లాడు. కొద్దిసేపటి తరువాత ఐదో అంతస్థు నుంచి కిందపడ్డాడు. తలకు గాయం కావడంతో అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. కుటుంబసభ్యులు స్థానికుల సహాయంతో 108కు సమాచారమిచ్చారు. వారొచ్చి వెంకటేశ్వర్లును పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు వెల్లడించారు. సరూర్‌నగర్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. వెంకటేశ్వర్లు కుటుంబసభ్యుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

పాల ప్యాకెట్ కోసం వెళ్తే కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

చాదర్‌ఘాట్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): వేగంగా వెళ్తున్న కారు ఢీ కొట్టిన సంఘటనలో వ్యక్తి గాయపడిన సంఘటన మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. కొత్తపేట ప్రాంత నివాసి రామకృష్ణ(55) వృత్తిరీత్యా వ్యాపారి. శాలివాహననగర్‌లోని షాపులో పాల ప్యాకెట్ కొనుగోలు చేసేందుకు ద్విచక్రవాహనంపై వచ్చాడు. వాహనం నుంచి దిగి షాపులోకి వెళ్తున్న రామకృష్ణను వేగంగా వెళ్తున్న బలేనో కారు ఢీ కొట్టింది. ఈసంఘటనలో రామకృష్ణ కుడి కాలు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే చికిత్స కోసం కొత్తపేటలోని సాయి సంజీవిని ఆస్పత్రికి తరలించారు. కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ సురేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఎంఓయూ పత్రాలు చూపిస్తున్న జీఎస్‌ఐ, ఎన్‌జీఆర్‌ఐ డైరెక్టర్లు

మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ కోసం ఎన్‌జీఆర్‌ఐ ఒప్పందం

ఉప్పల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ కోసం జియోఫిజికల్ స్టడీని నిర్వహించేందుకు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్‌ఐ)తో జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌జీఆర్‌ఐ) రూ.99.73 కోట్లకు ఒప్పందం కుదుర్చుకుంది. కోల్‌కతాలోని జీఎస్‌ఐ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఎంఓయూ చేసుకున్నట్లు ఒక ప్రకటనలో ఎన్‌జీఆర్‌ఐ వెల్లడించింది. ఇప్పటికే భౌగోళిక పరిశోధన, ఖనిజాల అన్వేషణలో పురోగతి సాధించినట్టు పేర్కొంది. జీఎస్‌ఐ డైరెక్టర్ జనార్ధన్ ప్రసాద్, ఎన్‌జీఆర్‌ఐ డైరెక్టర్ డా.ప్రకాష్ కుమార్ నేతృత్వంలో మినరల్ ఎక్స్‌ప్లోరేష్ ఆవిష్కృతం అయిందని వివరించింది. ఇరు సంస్థల మధ్య రాజస్థాన్ నుంచి మధ్యప్రదేశ్ వరకు 700 కిలోమీటర్ల మేర విస్తరించినట్టు జనార్ధన్ ప్రసాద్, ప్రకాష్ కుమార్ తెలిపారు. గుప్త ఖనిజ సామర్థ్యాన్ని అన్‌లాక్ చేయడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నట్టు పేర్కొన్నారు. ప్రాజెక్ట్ అమలు చేసే బాధ్యతను ప్రధాన శాస్త్రవేత్త డా.ప్రశాంత కెప్రా, ఎన్‌జీఆర్‌ఐ శాస్త్రవేత్త డా.బిస్వజిత్ మండల్ బృందానికి అప్పగించారు.

తెలుగు సినిమాకు జేజేలు సీడీ ఆవిష్కరణ



సీడీని ఆవిష్కరిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

చిక్కడపల్లి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఇట్క్లా సంస్థ నిర్వాహకులు డా. కే.ధర్మారావు రచించిన 91 వసంతాల తెలుగు సినిమాకు జేజేలు గేయరూపక సీడీని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ఇటీవల తన నివాసంలో ఆవిష్కరించారు. తొలి సీడీని నిర్మాత రామసత్యనారాయణకు అందజేశారు. వీఎస్.ప్రసాదరావు, కమలప్రసాదరావు, డా.భాస్కర్‌రెడ్డి, డా. విజయకుమార్, ప్రసాద్ సూపర నేని పాల్గొన్నారు.



తొర్రూర్‌లోని రేణుకా ఎల్లమ్మను దర్శించుకుంటున్న ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



మలక్‌పేట నల్గొండ చౌరస్తాలో నూతన సంవత్సరం కేక్ కట్ చేస్తున్న నగర సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి



మలక్‌పేటలో నూతన సంవత్సరం కేక్ కట్ చేస్తున్న సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ రోహిత్ రాజ్



కొత్తపేట అష్టలక్ష్మి ఆలయం వద్ద దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

జోన్ బృందం : నూతన సంవత్సర వేడుకలను ఆదివారం రాత్రి ఎల్బీనగర్, దిల్‌సుఖ్‌నగర్ జోన్ పరిధిలోని ప్రజలు, యువత ఘనంగా జరుపుకున్నారు. 2023 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ నూతన సంవత్సరం 2024కు స్వాగతం పలుకుతూ చిన్న పెద్ద తారతమ్యం లేకుండా రాత్రి 12.00 గంటలకు కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. మహిళలు ఇళ్ల ఎదుట నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ రంగులతో అందమైన రంగవల్లులు వేశారు. యువకులతో బేకరి షాప్‌లు కిటకిటలాడాయి. నూతన సంవత్సరం సందర్భంగా దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.



బాబా ఆలయంలో భక్తుల రద్దీ



అష్టలక్ష్మి ఆలయంలో మొక్కుతున్న యువతి



భక్తులతో కిటకిటలాడుతున్న కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయం

కేక్‌లకు గిరాకీ..

మూసారాంబాగ్, దిల్‌సుఖ్‌నగర్, మలక్‌పేటలోని బేకరీల్లో కేక్‌లకు భలే గిరాకీ పెరిగింది. న్యూ ఇయర్ కేక్‌లను ఎగబడి కొనుగోలు చేశారు. మామూలు రోజుల కన్నా రూ.5వేల నుంచి రూ.25వేల వరకు అదనంగా కేక్‌లపై వ్యాపారం చేసినట్లు బేకరీ నిర్వాహకులు తెలిపారు.



తట్టిఅన్నారంలోని లలిత భువనేశ్వరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో భక్తులు



కర్మన్‌ఘాట్‌లోని ధ్యానాంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



కొత్తపేట అష్టలక్ష్మి ఆలయంలో దర్శనం చేసుకుంటున్న భక్తులు



ఇంటి ముందర రంగవల్లికలను వేస్తున్న మహిళలు



ఇరవై రోజుల క్రితం చెరువు ప్రవేశ ద్వారం సమీపంలో (ఫొటోలో కనిపిస్తున్న చోట) ఉన్న యంత్రాన్ని తొలగించి..



..ఇలా చెరువుకు మరో పక్కన(ఎస్ఎల్ఎన్ఎస్ కాలనీ సమీపంలో) పెట్టారు.. పనులు మాత్రం మొదలు కాలేదు

యంత్రానికి స్థాన చలనం.. గుర్రపుడెక్క యథాతథం..!

- 'ఆంధ్రజ్యోతి' కథనంతో ఒక్కరోజు హడావుడి
- మారని చెరువు దుస్థితి

సరూర్‌నగర్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని మంత్రాలచెరువు దుస్థితి ఏమాత్రం మారడం లేదు.. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు కేవలం ఒక్కరోజు మాత్రమే హడావుడి చేసి చేతులు దులుపుకున్నారనే విమర్శలు వినవస్తున్నాయి. మంత్రాలచెరువును నిండుగా గుర్రపుడెక్క కప్పేయడం తో పరిసర కాలనీలవాసులు దోమలు, దుర్వాసనతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న విషయాన్ని 'గుర్రపుడెక్క కథ మళ్లీ మొదటికి..!' అనే శీర్షికతో డిసెంబర్ 14న 'ఆంధ్రజ్యోతి' కథనంలో ప్రస్తావించిన సంగతి తెలిసిందే. ఈ కథనంతో ఎమ్మెల్యే సబితారెడ్డి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో.. అప్పట్లో చెరువు ప్రవేశమార్గం వద్ద ఉన్న గుర్రపుడెక్క తొలగింపు యంత్రాన్ని అక్కడి నుంచి తొలగించి.. చెరువుకు దక్షిణం వైపు ఉన్న ఎస్ఎల్ఎన్ఎస్ కాలనీ వైపు పెట్టారు. అంతేగానీ అక్కడ ఎలాంటి పనులూ జరగడం లేదు. కేవలం యంత్రానికి స్థాన చలనం కలిగించారే తప్ప గుర్రపుడెక్క తొలగింపుపై మాత్రం అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోలేదని, ఇది వారి నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనమని పరిసర కాలనీలవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి సత్వర చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.



గుర్రపుడెక్క కథ
మళ్లీ మొదటికి..!

డిసెంబర్ 14న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం

రాచకొండలో పెరిగిన డ్రంకెన్ డ్రైవ్ కేసులు

- గతేడాది 446, ఈ యేడాది 517
- సెంచరీ దాటిన ఉప్పల్, వనస్థలిపురం

కొత్తపేట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకల వేళ రాచకొండ పరిధిలో గతేడాది డీడీ(డ్రంకెన్ డ్రైవ్) కేసుల సంఖ్య 446 ఉండగా ఈ యేడాది 517 కేసులు నమోదయ్యాయని రాచకొండ ఈ - చలానా విభాగం తెలిపింది. ఈ యేడాది నూతన సంవత్సర వేడుకల వేళ రాచకొండ పరిధిలోని 9 ట్రాఫిక్ పీఎస్‌ల పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఈసారి నమోదైన 517 డీడీ కేసుల్లో అత్యధికంగా ఉప్పల్ 107 కేసుల(గతేడాది 76 కేసులు)తో వనస్థలిపురం 105 కేసుల(గతేడాది 95 కేసులు)తో సెంచరీ దాటాయి. కుషాయిగూడ 89 కేసులతో 3వ స్థానంలో, 87 కేసులతో ఎల్‌బీనగర్ 4వ స్థానంలో ఉన్నాయి. మల్కాజిగిరిలో 48 కేసులు నమోదు కాగా, అత్యల్పంగా ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ పీఎస్ పరిధిలో 12 డీడీ కేసులు, యాదాద్రిలో 20, భువనగిరిలో 25, చౌటుప్పల్‌లో 24 కేసులు నమోదయ్యాయి. మద్యం మత్తులో వాహనాలు నడిపి డీడీ తనిఖీల్లో పట్టుబడిన 517మందిలో అత్యధికంగా 21 - 30 సం.ల మధ్య వయసున్న వారు 223 మంది, 31 - 40 సం.ల వారు 168 మంది, 41 - 50 సం.ల వారు 84మంది, 51 - 60 సం. ల వారు 31మంది ఉన్నారు. 18 - 20 సం. ల వారు 9మందిపై డీడీ కేసులు నమోదుకాగా, ఇద్దరు 61 - 70 సం.ల వృద్ధులు మద్యం మత్తులో వాహనాలు నడిపి పట్టుబడ్డారు. ఈ నేపథ్యంలో నమోదైన డీడీ కేసుల్లో భాగంగా అత్యధికంగా 431 ద్విచక్ర వాహనాలను, 10 ఆటోలను, 76 కార్లనూ సేఫ్ కస్టడీ కింద ఆయా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లకు తరలించారు.



డ్రంకెన్ డ్రైవ్ తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ పోలీస్

మలక్‌పేటలో పట్టుబడిన 53మంది వాహనదారులు

చాదర్‌ఘాట్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): న్యూ ఇయర్ వేడుకల్లో భాగంగా ఆదివారం రాత్రి 8గంటల నుంచి అర్ధరాత్రి 1గంట వరకు మలక్‌పేట ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 53 మంది వాహనదారులు పట్టుబడ్డారు. మలక్‌పేట ట్రాఫిక్ పోలీసు పరిధిలోని దిల్‌సుఖ్‌నగర్‌లో నిర్వహించిన డ్రైంకెన్ డ్రైవ్ తనిఖీ కేంద్రంలో పట్టుబడిన 53మంది వాహనదారుల్లో 48 మంది ద్విచక్ర వాహనదారులున్నారు. మరో ఐదుగురు కార్ల డ్రైవర్లు డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డారని మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగం చంద్రశేఖర్ తెలిపారు. వీరి వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడిన వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించి కోర్టులో హాజరుపరుస్తామన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

మన్సూరాబాద్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): నాగోల్ డివిజన్ కురుమ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2024 సంవత్సర క్యాలెండర్‌ను కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేషం సోమవారం నాగోల్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వస్పరి శంకర్, సిద్దాల శంకర్, వస్పరి మల్లేష్, యెగ్గె కుమార్, యెగ్గె భిక్షపతి, సిద్దాల బాలప్ప, కుమార్, వెంకట్ పాల్గొన్నారు.

జీఎస్ఐ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్..


జీఎస్ఐ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ ఆదర్ల మహేశ్, రీజినల్ సెక్రటరీ మదిర సత్యనారాయణ ఆధ్వర్యంలో రూపొందించిన 2024 సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం బండ్లగూడలోని జీఎస్ఐలోని కింగ్స్ మ్యూజియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంస్థ అడిషనల్ డైరెక్టర్ జనరల్ సీహెచ్ వెంకటేశ్వరరావు హాజరై ఆవిష్కరించారు. డీడీజీలు ఎల్.పి.సింగ్, అన్షుమన్ ఆచార్య, మహాపాత్ర, డైరెక్టర్ ఎం.ఎల్.దొర, హర్మోహన్ మిషారా, వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు ఇ.చంద్రయ్య, పి.సి.మాథ్యూ, చంక్రేశ్వర్ పాల్గొన్నారు.

మహా పడిపూజ

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ శివారు కవాడిపల్లిలోని కోదండ రామచంద్రస్వామి ఆలయ గుట్టపై అయ్యప్ప స్వామి మహా పడిపూజ సోమవారం ఘనంగా జరిగింది. కవాడిపల్లి సర్పంచ్ దూసరి సుజాతయాదయ్యగౌడ్ కుమారులు దూసరి ఉపేందర్‌గౌడ్, వరుణ్‌కుమార్‌గౌడ్(కన్నెస్వామి) ఆధ్వర్యంలో పడిపూజ వైభవంగా నిర్వహించారు. ఈ పూజలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేష్, జడ్పీటీసీ బింగి దేవదాసుగౌడ్, వైస్ ఎంపీపీ కొలన్ శ్రీధర్‌రెడ్డి, గురు స్వాములు దివీ లక్ష్మణాచార్యులు పాల్గొన్నారు.



శ్రీరాముని అక్షింతలను పంపిణీ చేసేందుకు తీసుకెళ్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి, నవకిషోర్‌రెడ్డి తదితరులు



అక్షింతలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ అరుణాసురేందర్‌యాదవ్

ఇంటింటికీ అయోధ్య రాముని అక్షింతలు

సైదాబాద్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థట్రస్ట్ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో ఐఎస్‌సదన్ డివిజన్ బృందావన్ కాలనీ, నాగార్జుననగర్, వైశాలీనగర్ వీధుల్లో అయోధ్య రాముని అక్షింతల కలశ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్ రెడ్డి మాట్లాడుతూ రామయ్య అక్షింతలను ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.



శ్రీరాముని అక్షింతల పంపిణీ కార్యక్రమంలో కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

బ్రాహ్మణపల్లిలో..

హయత్‌నగర్ : తుర్కయంజాల్ మున్సిపాలిటీ బ్రాహ్మణపల్లిలోని షిరిడీపురం కాలనీకి రాముడి అక్షింతలను ఊరేగింపుగా భజన చేసుకుంటు తీసుకువచ్చారు.

వనస్థలిపురం : రాముడి అక్షింతలను కాలనీవాసులు సద్వినియోగం చేసుకోవాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. ఈ మేరకు బీఎన్‌రెడ్డినగర్‌లోని ధ్యాసాంజనేయస్వామి ఆలయం, ఎస్కేడినగర్‌లోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి రాముడి అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు.

కమలానగర్‌లో..

హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని కమలానగర్‌లో శ్రీరాముని అక్షింతలు ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి పాల్గొని స్వామి వారి అక్షింతలను కాలనీవాసులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శ్రీరాముని అక్షింతలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నాగోల్‌లో..

మన్సూరాబాద్ : నాగోల్ డివిజన్‌లోని పలు కాలనీల్లో సోమవారం రాముని అక్షింతలను పంపిణీ చేశారు. కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్‌యాదవ్ హాజరై అక్షింతలను ప్రజలకు అందజేశారు. వస్పరి మల్లేష్, దప్పు రాజు, శ్రీధర్‌రెడ్డి, చంద్రశేఖర్, మురళీకృష్ణ, కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.